# తెర వెనుక

"డియర్ పార్వతీ!"

నేను గుర్తున్నానా? నీ కాలేజీమేట్‌ని! బై ది బై నీ రూమ్‌మేట్‌ని కూడా! సరోజని! ఇప్పుడేనా జ్ఞాపకంవచ్చానా? ఏమో! ప్రఖ్యాత సినీహీరో "మనోహర్" భార్యవు. అంతస్తులో, హోదాలో, ధనంలో, ఓహ్! ఒకటేమిటి? అన్ని విధాలా ఆకాశంలో వున్నదానివి—ఎక్కడో, ఎప్పుడో కాలేజి రోజుల్లో స్నేహితురాలైన ఓ అమ్మాయి గుర్తుంటుందా?

అయినా నీకు తెలుసుగా? నేను ఆశావాదిని! మొండిగా నీ ఇంటికివచ్చి కూర్చుని నన్ను నేను పరిచయం చేసుకునేనా మాట్లాడి వెళ్తాను. సినిమాలలో గాకుండా, మీ వారిని ఇంటి దగ్గర చూడాలనే తీవ్రవాంఛకూడా నాకుందనుకో! అపార్థం చేసుకోకు. పదో తేదీ సాయంత్రం నాలుగ్గంటలకు మీ ఇంటికి వస్తాను. ఏ ప్రోగ్రాములూ పెట్టుకోవుగదూ? ఎలా అయినా అన్నివిధాలా అదృష్టవంతురాలివి!

అన్నట్లు అసలు సంగతి వ్రాయటం మర్చే పోయాను. నేనిప్పుడు హఠాత్తుగా మద్రాస్ చూడాలనే కోర్కెతో ఊడి పడ్తున్నా ననుకుంటున్నావ్ కాబోలు! అదేంలేదు. బోలెడంత కథ ఉంది...టూకీగా వ్రాస్తాను.

నాకు పెళ్ళయి దాదాపు ఎనిమిదేళ్లు కావొస్తుందని నీకు తెలుసుగా? అప్పట్నించి ఇప్పటికీ మేమిద్దరం చెట్టాపట్టాలు వేసుక స్వేచ్ఛగా తిరుగుతున్నాం! మా అత్తగారికేమో మా మధ్య ఏడుస్తూ, మొత్తుకుంటూ తిరిగేపిల్లలు లేరని ఒక బెంగ! దాంతో ఆవిడ ఏకగోల! అన్నవరం సత్యనారాయణస్వామి దగ్గరికీ, యాదగిరి నరసింహస్వామి దగ్గరికీ, జొన్నలగడ్డ కామా క్షమ్మ గుడికీ - ఒకటేమిటి ఎక్కడెక్కడున్న ముక్కోటి దేవత లకూ మొక్కింది. నా చేత మొక్కించింది. కనిపించిన ప్రతి చెట్టుకూ, పుట్టకూ రాళ్లు కట్టించింది. ఫలితం కనిపించలేదు. ఆవిడ పిచ్చిగానీ, పిల్లలు లేకపోయినంత మాత్రాన మా కిప్పు డొచ్చిన లోటేమిటి చెప్పు? అలా ఆవిడ ఊరుకోదే! ఈ ఇక్ష్వాకు వంశం నిలబడకపోతే ఎలా అంటుంది. మద్రాస్‌లోని పార్థసారథి స్వామికీ, (సంతాన గోపాలస్వామికీ) ప్రదక్షిణలుచేసి మొక్కు కుంటే పిల్లలు పుడతారని మా అత్తగారి చెవిలో వూదారు ఎవరో ఆవిడ స్నేహితురాలు. అంతే; ఆఘమేఘంగా ప్రయాణం కట్టించేస్తోంది. నా దిగులల్లా ఒకటే! నా కోసం తనుకూడా అందరు దేవుళ్ళకూ "నలుగురు బిడ్డలు పుడితే చాలు స్వామి!" అంటూ మొక్కుతోంది! వచ్చే జన్మలో ఈ మొక్కులన్నీ కలిసి ఆవిడకు డజన్లకొద్దీ పిల్లలు పుడతారు కాబోలు!

ఏదెలా అయితేనేం? నిన్ను చూడటానికిదో చక్కటి అవకాశం వచ్చింది. అంతేచాలు! మరి వుంటా.

నీ, మర్చిపోదామనుకున్నా మర్చిపోనివ్వని "సరోజ".

ఉత్తరాన్ని చేత్తో నలుపుతూ, ఎంతసేపుందో పార్వతి! లైటు వెలిగిన వెల్తురూ, "అమ్మగారూ! చీకటి పడింది!"

అంటున్న లక్ష్మి గొంతూ ఒక్కసారే ఆమెను ఇహప్రపంచం లోకి తెచ్చాయి.

సరోజ ఉత్తరంలోని ఒక్కో వాక్యమూ తిరిగీ గుర్తుకు వస్తున్నాయి. "ప్రఖ్యాత సినీ హీరో మనోహర్ భార్యవు !" అవును ! ఆ దురదృష్టానికి నోచుకున్న దౌర్భాగ్యురాలు తనే ! "అంతస్తులో, హోదాలో, ధనంలో ఆకాశంలో ఉన్నదానివి!" "హుఁ!" బాధగా నవ్వుకుంది పార్వతి. వీటన్నిటి వెనుక ఎన్ని మ్రింగలేని బాధ లున్నాయో సరోజ కేం తెలుసు ? "ఎలా అయినా అన్ని విధాలా అదృష్టవంతురాలవి !"

ప్రపంచంలో డబ్బూ, అంతస్తూ వుండగానే, అదృష్టమూ, సుఖమూ, శాంతీ కూడా తరుముకు వస్తాయని చాలా మంది అభిప్రాయం ! దూరాన్నుంచి తనను గురించి ఊహించే వాళ్ళందరికీ తన జీవితం మల్లెలబాట, గులాబీలతోట, సుఖాల ఊట ! కాని తనకు...తనకు...?

"అమ్మా ! స్టార్ థియేటర్‌లో నాన్నగారు నటించిన కొత్తపిక్చర్ రిలీజయిందమ్మా ! సీట్లుకూడా రిజర్వుచేయించాను. వెళ్దాం, రెడీగామ్మా !" రామకృష్ణ హడావుడిగా లోపలికి వచ్చి, తల్లిని చూచి నిర్ఘాంతపోయాడు.

సోఫాలో కూర్చొనివున్న పార్వతి కళ్ళు పీక్కుపోయి, జుట్టు రేగి, చెప్పలేనంత బడలికగా కళాహీనంగా జబ్బుపడి లేచిన దానిలా ఉంది !

"అదేమిటమ్మా! అలా వున్నావు? ఒంట్లో బాగా లేదా?" రామకృష్ణ ఆదుర్దాగా వచ్చి తల్లి పక్కన కూర్చున్నాడు.

"బాగానే వుందిరా కృష్ణా!"

ఎందుకో ఆ మాటలు నమ్మబుద్ధి గావటంలేదు రామ కృష్ణకు. "ఏమిటమ్మా ఏమైంది? ఆ కన్నీళ్లెందుకు?" తిరిగి రెట్టించాడు. పార్వతి తనను తానే సంబాళించుకుంది. "ఏమిటో కాస్త భారంగా చికాకుగా ఉందంతే! అదేం చిత్రమోరా కృష్ణా! ఈ రోజు ఆవులిస్తే కన్నీళ్లొస్తున్నాయిరా!" కొడుకు తన వాలకం కనిపెట్టకుండా వుండేందుకు రాని నవ్వు నవ్వుతూ లేచి నిల్చుని, వీడిన చుట్టముడి సరిగా వేసుకొనే నెపంతో ముందుకు నడిచింది పార్వతి.

"అంతేనా? మరేమిటోనని గాభరాపడ్డాను." ఆవులిస్తే వచ్చే కన్నీళ్ళకూ, దుఃఖంతో వచ్చే కన్నీళ్ళకూ భేదం తెలియని రామకృష్ణ కుదుటబడ్డాడు. వెంటనే తిరిగీ ఉత్సాహంగా అన్నాడు. "వెళ్దాం రామ్మా సినిమాకు, ఇంకా ఇరవై నిముషాలు టైముంది.

"అబ్బ! ఏం సినిమాలురా! ఓ కథా? పాడా? నే రాలేను బాబూ?"

"అలా అయితే నేనూ వెళ్ళను!" బుంగమూతి పెట్టి కోపంగా అంటున్న కొడుకువేపు చూచింది పార్వతి.

పన్నెండు సంవత్సరాల రామకృష్ణ, వయసుకుమించి పెరిగాడు తండ్రిలానే. అందంగా హుందాగా వున్నాడు.

"సర్లే! కారు సిద్ధం చెయ్యమను డ్రైవర్ని! ఈ లోపల నేను మీ నాన్నగారికి ఫోన్ చేసి చెబుతాను, మనం సినిమాకు వెళ్తున్నట్లు...." "అలాగే!" ఉత్సాహంగా మేడ మెట్లు దిగి పరిగెత్తాడు రామకృష్ణ!

న్యూస్‌రీల్ పూర్తయి టైటిల్స్ చూపిస్తున్నారు. గేటు కీపర్ సవినయంగా సీట్లు చూపించి వెళ్ళిపోయాడు. కూర్చుంటూ చుట్టూరా చూచింది, పార్వతి. హాలంతా కిటకిట లాడుతోంది. జంటలు జంటలుగా దంపతులు కూర్చుని రక రకాల సంభాషణలు చేస్తున్నారు.

నాయకీ నాయకుల యుగళ గీతంతో ప్రారంభమైంది పిక్చర్. అసలే అందంగా వుండే మనోహర్, మేకప్‌లో మరింత అందంగా, నవమన్మధునిలా వెలిగిపోతున్నాడు. కథా నాయికగా వేసిన లలిత, మామూలుగా అనాకారి అయినా, మేకప్‌లో చక్కగా వుంది! పూలతోటల్లో, జలపాతాల అంచుల్లో పరుగులెత్తుతూ, అలా కౌగిలిలో కరిగిపోతూ పాట పాడుతున్నారు నాయకీనాయకులు. కాదు...కాదు; తన భర్తా, మరో పరాయి స్త్రీ!

పార్వతి హృదయం అసహ్యంతో, జుగుప్సతో, ఆవేద నతో నిండిపోతోంది! పక్కకు తిరిగి చూచింది. తదేక ధ్యాన ముతో సినిమా చూస్తున్నాడు రామకృష్ణ! తెరమీద తండ్రి అలా నటిస్తుంటే, తనబిడ్డ ఏమనుకుంటున్నాడో? హుఁ! తన పిచ్చిగానీ వీడికప్పుడే ఇన్ని వూహాలున్నాయా? అంత ఆలో చనాశక్తి వుందా? ఒకవేళ ఉన్నా వాడూ మగవాడే! కాబట్టి తన తండ్రి నటనను హర్షిస్తాడు, వీలైతే తనూ తండ్రిని

అనుకరించాలని చూస్తాడు...మగపిల్లలకు తండ్రి పోలిక, ఆడ పిల్లలకు తల్లిపోలికలు వస్తాయంటూరు. అలా వస్తే, రూపంతో పాటు గుణంలో కూడా...రామకృష్ణ తండ్రిని మరిపిస్తాడా? అంటే? ఎక్కడో ఈ సరికే పుట్టి పెరుగుతున్న నిర్భాగ్యురా లెవరో...తనలానే...పార్వతి కళ్ళు తెరచివున్నాయే కానీ, అవి తెరను చూడటం లేదు ... గతంలోని తెరలను తొలగించు కుంటూ, గత స్మృతులను దాటుకుంటూ, యౌవ్వనంలోని దృశ్యాలను చూస్తున్నాయి! ఒక్కసారి తన పెళ్ళినాటి సంఘటన ప్రత్యక్షమైంది.

"సామజ వర గమనా!" అంటూ హిందోళరాగం ఆలాపిస్తున్నారు సన్నాయి వాద్యగాళ్ళు శ్రావ్యంగా! ఆ రాగంలోనే అంతటి మాధుర్యం ఉందో, లేక త్యాగరాజు భక్తి పారవశ్యంలోని ఆ పదజాలపు పొందికకే అంతటి మహత్యం ఉందో తెలియదుకానీ, "సామజ వర గమనా" అంటూ అన్ని వంపులూ, అన్ని సొంపులూ తిప్పుతుంటే, "కర్నాటిక్ మ్యూజిక్ ఛీ" అంటూ చెవులు మూసుకునే వారు కూడా, 'భేష్' అంటూ తలలు తిప్పేస్తున్నారు! ప్రాణా లుగ్గబట్టి, మెడనరాలు ఉబ్బిపోయేలా పళ్ళు బిగబట్టి, డోలుమీద ముక్తా యింపులు వేస్తున్నారు డోలు వాద్యగాళ్ళు. వచ్చే పోయే జనాన్నీ, కార్లనూ వింతగా చూస్తున్న తాళం కుర్రాడు, అన్యమనస్కంగా, "ఆదితాళం" వేసి చీవాట్లు తిన్నాడు.

మరోవైపు బ్యాండులో పాశ్చాత్య సంగీతం వినిపిస్తోంది. పెళ్ళి పందిరి కోలాహలంగా వుంది.

"అమ్మాయిని పిల్చికెళ్ళి గౌరిపూజ చేయించండమ్మా!" పురోహితుడి గావుకేకతో, ఇద్దరు ముత్తైదువలు పార్వతిని పీటలమీదినుంచి లేవదీసి, లోపలికి నడిపించుక వచ్చారు.

"అదిగో! ఆ పసుపు ముద్దమీద అక్షింతలు చల్లుతూ పూజ చేసుకో అమ్మా !" అంది పార్వతి మామ్మ.

"అలాగే మామ్మా!" అంది పార్వతి, పెద్దావిడ పుర మాయించిన పని కుపక్రమిస్తూ. పందిట్లో వింత చూడటానికి అంతా వెళ్ళారు. పార్వతి, పూజాపీఠం మిగిలారు గదిలో.

అక్షింతలు చల్లుతోందేగానీ, మనస్సుమాత్రం పూజమీద లేదు పార్వతికి! ఆనందంతో ఉక్కిరిబిక్కిరౌతోంది. ఇది కలా? నిజమా? అనే భావంకూడా వుండివుండి మెదుల్తూంది.

సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన తనేమిటి? ఓ ప్రఖ్యాత సినిమా హీరో భార్య గాబోవట మేమిటి? వద్దన్నా జరిగినవి గుర్తుకొస్తున్నాయి పార్వతికి.

కొత్తగా బాగా పేరులోకి వస్తున్న హీరో మనోహర్! ఎక్కడ చూచినా అతడి ఫొటోలే! ఎటుచూచినా అతగాడు నటించిన పిక్చర్లే! అతడి ముఖంలో అందం ప్రతి ఒక్కరినీ ఆకర్షించేదిగా వుంటుంది. చిన్నకళ్ళు. నవ్వినపుడు సొట్టలు పడే బుగ్గలు. మాటవినకుండా ముఖంమీదకు పడే నొక్కుల క్రాపూ. ఎవరినేనా ముఖ్యంగా కన్యల హృదయాల్ని దోచుకుంటా యనటంలో ఆశ్చర్యంలేదు.

పార్వతి కయితే మరీను! మనోహర్‌ను సినిమాలో చూస్తుంటే, ఆమె హృదయం పరవశించి పట్టుదప్పిపోతుంది.

"ఆ మనోహర్ పక్కనున్న కథానాయకిని నేను కాగలిగితే ?" అనే కోర్కె, భావన మనస్సును మథించి, మరునిముషంలో అలాటి అనుభూతే పొంది, గిలిగింతలు కలిగిస్తాయి. కానీ అత గాడికేం! తన సమ్మోహన రూపంతో, నటనా చాతుర్యంతో అప్పుడే లక్షాధికారి అయ్యాడు. ఏ సినీ తారనో లేక ఏ కోటీ శ్వరుల పిల్లనో పెళ్ళాడుతాడు గానీ తనను వెదుక్కుంటూ వస్తాడా ? ఎక్కడ ఆకాశం, ఎక్కడి నేల ?

క్షణంలో కుశంకలెన్నో రేగి మనస్సును కలచివేస్తాయి. పెళ్ళిచూపులకు వరుడూ, అతని తల్లిదండ్రులూ వస్తున్నారని తెలిసి, వివరాలు విని నమ్మలేకపోయింది పార్వతి.

"వాళ్ళది మంచి సాంప్రదాయసిద్ధమైన కుటుంబమట. ఆ అబ్బాయి సరదాకొద్దీ సినిమాల్లో వేషం వేస్తున్నా డనుకోండి... కోడలు మాత్రం మంచి కుటుంబంలోనుంచి వచ్చిందిగా వుండాలని అతని తల్లిదండ్రుల అభిప్రాయమట ! ఇక ఆ అబ్బాయేమో 'నే నెలాగూ లక్షలార్జిస్తున్నాను... నాకు ఒకరిచ్చేదేమిటి కట్నాలూ కానుకలూ ! చూడటానికి అందంగావుండి, మంచిగుణం కల అమ్మాయిగా వుండి నాకు నచ్చితే వివాహం చేసుకుంటాను' అన్నాడుట !

మా ఆడబిడ్డద్వారా మా కుటుంబం సంగతి మా అమ్మాయి పార్వతిని గురించి విని, పెళ్ళిచూపుల కొస్తున్నారు. ఏదోలెండి ! మా తల్లి అదృష్టం. మా పూజ బాగుంటే అన్నీ కుదిరి...ఆ మూడుముళ్లూ పడతాయి !"

జాజిపందిరి వారగా నిల్చుని, తన తల్లి పక్కింటి వెంకా యమ్మగారితో చెబుతుంటే విని పార్వతి శరీరం పులకరించింది.

వచ్చిన వరుడు మనోహర్ అందానికి ప్రతినిధి. అందు లోనూ ఎంతోమంది అందమయిన స్త్రీలతో పరిచయమున్న వాడు, నటించినవాడు కూడా! తనను అంగీకరిస్తాడా? ఇదే ఆలోచన ఉదయంనుంచీ వేధిస్తూంది పార్వతిని....అందుకే యీ సమయంలో ఆమె తల కాదుగదా, కళ్ళుకూడా సరిగా ఎత్త లేకపోతూంది.

"ఇదుగో అమ్మాయ్! అలా నేలకేసి చూస్తే నేల చిల్లులు పడ్తుందేమో!" మనోహర్ నవ్వుతూ అంటున్న మాటలు గదిలో ప్రతిధ్వనించేయి. ఒక్కసారిగా అంతా నవ్వారు. సిగ్గుతో మరింతగా ముడుచుకుపోయింది పార్వతి. క్షణాలమీద ముహూర్తం నిర్ణయం కూడా జరిగిపోయింది. కలలో మాత్రమే తీరగల కోర్కె యిలలో జరగటం ఎంత అదృష్టం? అలాటి అదృష్టవంతు లెందరుంటారు? "పార్వతీ! నీ కాలిగోటికున్న అదృష్టం మా నుదుట వ్రాయలేదు బ్రహ్మ! అందుకే సునాయాసంగా ఏ ప్రయత్నమూ లేకుండా నిన్ను అదృష్టదేవత వరించేస్తోంది!" కొంత అసూయ, మరికొంత స్నేహమూ, అన్నీ కలిపి వాక్యాలలోకి అనువదించారు స్నేహితురాళ్ళు సరోజ, మాలతి.

"పార్వతీ! రామ్మా! పురోహితుడు నిన్ను పిల్చుకు రమ్మంటున్నాడు."

పార్వతి మామ్మ పిలుపుతో ఆలోచనలకు స్వస్తి చెప్పి లేచి నిల్చుంది! అసలు తనింతసేపు ఏం పూజ చేసిందని? పురోహితులు మంత్రాలు వల్లిస్తున్నారు. డోలు సన్నాయి వాద్యగాళ్ళు ఏ రాగమో అంతు తెలియకుండా బిగ్గరగా వాయించేస్తున్నారు. క్షణంలో మనోహర్ చేతిలోని మంగళ సూత్రం పార్వతి మెడలోకి వచ్చేసింది!

* * *

తారురోడ్డుమీద కారు మెత్తగా వెళ్తోంది.

"పార్వతీ!"

వెనక సీట్లో పార్వతీ, మనోహర్‌లు కూర్చున్నారు. పార్వతి హృదయం అయోమయంగా వుంది. ఆనందంతో, సిగ్గుతో, సంకోచంతో మొగ్గలా ముడుచుకుపోయి కూర్చుంది.

"పార్వతీదేవిగారూ! మిమ్మల్నేనండీ" మనోహర్ ఆజానుబాహువులు పార్వతిని పెనవేశాయి.

ఊ! అంది ఎలాగో పార్వతి. అతి దుఃఖమూ, అత్యంత ఆనందమూ కూడా మానవునిలో మాటలను కరువుచేస్తాయి.

ఓ వేపు డ్రైవర్ వెనుదిరిగి చూస్తాడేమోనని భయం. మరోవేపు భర్త బాహుబంధాన్ని సడలింపలేని అశక్తతా వేధిస్తున్నాయి పార్వతిని.

ఇంత చక్కటి భార్యను పొందగలిగిన నేను బంగారు పూలపూజ చేసుకుంటాను కదూ? పార్వతి చెంపలని స్పృశిస్తున్న అతని పెదవులు అస్పష్టంగా అంటున్నాయి.

ఏదో చెప్పబోయి సిగ్గుతెర అడ్డుతగిలి, ఊఁ! అనేసింది పార్వతి.

'నీకు ఉ, ఊ, లు మినహా మరే అక్షరాలూ, మాటలూ రావనుకుంటాను!'

ఫక్కుమని నవ్వింది పార్వతి.

'అలా నవ్వు!'

'డ్రైవర్ !' గొణిగింది పార్వతి.

ప్చ్! అదంత లెక్కలోకి తీసుకోవాల్సిన విషయం కాదన్నట్లు తోసేసాడు.

'పార్వతీ? స్వర్గం అనేది ఎక్కడో వుందనీ, దానికోసం సంవత్సరాల తరబడీ, ఇంకా మాట్లాడ్తే జీవితాంతం, గడ్డాలూ మీసాలూ పెంచుక తపస్సు చెయ్యాలనీ అంటారు మన పెద్దలు. అంత తపస్సూచేసి, అన్నివాంఛలూ చంపుకుని, చావబోయే చివరిక్షణాల్లోనో, చచ్చాకనో స్వర్గం చూస్తారుట! అప్పుడు వాళ్ళకు లభ్యమయ్యేదేమిటి? రంభా సంభోగం! ఇలాంటి గడ్డాలవారిని వేలాదిమందిని మార్చిన ఆ రంభకోసం ఇన్నిపాట్లు పడటంలో అర్థముందంటావా?'

పార్వతి విస్మయంగాచూస్తూ వింటోంది. "కేవలం నటుడే కాదు మంచి వక్తకూడా తన భర్త" అంటున్నాయామె కళ్లు!

'అదిగో అలా కళ్ళు వాల్చేయకు. అది సిగ్గో నిద్రో తెలియదు నాకు!'

మనోహర్ నవ్వు గిలిగింతలు పెడుతోంది.

"ఆఁ! స్వర్గాన్ని గురించికదూ చెబుతూంట? ఈ రోజుల్లో మాత్రం స్వర్గ నరకాలెక్కడో లేవు. మనిషి చేతిలో నేవున్నాయి. నా సంగతి చూడు రెండు చేతులా ఆర్జిస్తున్నాను. కంటికీ, మనసుకూ నచ్చిన కన్య, ఇల్లాలై వడిలో ఉంది. ఇంతకంటె స్వర్గం మరెక్కడుంటుంది!"

"నిజం!" ఇంతసేపటికి పార్వతి పెదవులు విడివడ్డాయి. "కలలోకూడా ఊహించని వ్యక్తి భర్తగా దొరికాడు. మీ అనురాగవల్లరిలో కరగించివేస్తున్నారు... ఇక స్వర్గం ఎక్కడో వుందంటే ఎలా నమ్మగలను!" ఒకవిధమైన పారవశ్యంతో మనోహర్ కు హత్తుకుపోయింది పార్వతి.

"అబ్బో! మాటలు చాలా బాగా మాట్లాడ్తావన్న మాట!" మనోహర్ పార్వతుల నవ్వు కారు జోరులో, గాలి హోరులో మెత్తగా కలిసిపోయింది.

* * *

ఆరు నెలలు ఎలా గడిచిపోయాయో పార్వతికి తెలియదు. మనోహర్ సృష్టించిన స్వప్నలోకంలో ఆమె హృదయము విహంగమై విహరించింది. చక్కటి పెద్ద బంగళా. చుట్టూ అందమైన పూలతోట ... కాంపౌండు లోపల ఉన్న చిన్న స్విమ్మింగ్ పూల్, నృత్యభంగిమలో గిరగిర తిరుగుతూ నిల్చున్న పాలరాతి వనిత విగ్రహంలో నుంచి వెదజల్లబడే నీటి ఫౌంటెన్. మరోవేపు స్టార్ ఆకారంలో వున్న లాన్! ఇంటినిండా నౌకర్లు. షికార్లు, స్నేహితులు, విందులూ, వినోదాలూ మినహా మరే చీకూ చింతా లేని జీవితం. అన్నిటికీ

మించి సంఘంలో పేరు ప్రతిష్టలూ, సిరిసంపదలూ వున్న అపు రూపమైన భర్త! ఈ అందమైన కలలాంటి జీవితం కలకాలం అలాగే సాగుతుందని పార్వతి భ్రమపడింది... కాని ఆ భ్రమ ఎంతోకాలం నిలువలేదు.

మనోహర్‌కు క్షణం తీరిక దొరకటంలేదు. ఉదయం ఆరుగంటలకు స్టూడియోకు వెడితే ఇక తిరిగి అర్ధరాత్రి దాటిం తర్వాతే అతడి ఆగమనం! చెసేందుకు ఏ పనీలేదు పార్వతికి. పుస్తకాలు చదివి చదివి బుర్ర వేడెక్కటం మినహా మరో ఆదాయం కనిపించటంలేదు. అసలలా విపరీతంగా పుస్తకాలు చదవటంవల్ల కలిగే ఆనందం కంటే తలనొప్పి అధికంగా వుంటోంది. స్నేహితులూ విందులూ వినోదాలూ కూడా విసు గెత్తి పోయాయి.

అసలు తన సొసైటీయే వేరు. డబ్బుకున్న విలువ మరి దేనికీలేదు. ఏ స్నేహితురాలొచ్చినా తనకున్న చీరెలు నగలు వాటి విలువా ఏకరువు పెడ్తుంది. అంతటితో వూరుకోదు. "పార్వతిగారూ! మీరీమధ్య రవ్వల నెక్లెస్ తీసుకున్నారటగా? ఖరీ దెంతయింది? మజూరీ ఎంత? ఆ బదులు ఫస్టుక్లాస్ డైమండ్స్ పొదిపించలేక పోయారా? మావారు నా కోసం మరో కారు కొనబోతున్నారు...మరో బంగళా కూడా కొంటాం మా మామగారికీ అత్తగారికీనూ..." ఇలా డబ్బు తత్సంబంధమయిన వస్తువుల చుట్టూరానే సాగుతుంది సంభాషణ.

ఏ సమయాని కే పనులు చెయ్యాలో నౌకర్లందరికీ కంఠతా వచ్చు. ఏలాటి ఆయాసమూ లేదు. అస్తమానూ ఏకాంతమే శరణ్యమయింది పార్వతికి. నెలలు నిముషాలుగా

గడిచిపోయిన రోజులు కొన్నయితే నిముషం రోజులుగా గడుస్తున్నాయి యీ రోజు.

సాయంత్రం ఆరుగంటల నుంచి మనోహర్ కోసం నిరీక్షణే మిగుల్తోంది పార్వతికి. ఒక్కోరోజు అసలింటికే రావటం లేదు...ఫోన్‌లోనే "ఈరోజు షూటింగులు ఎక్కువగా వున్నాయి. క్షణం తీరటంలేదు...నేను రాను..." అని చెప్పేస్తాడు మనోహర్ ! హతాశురాలై కూర్చుండిపోతుంది పార్వతి. అంత పెద్ద బంగళాలో తనొక చిన్న కీటకంలా వున్నట్లు తోస్తుందామెకు.

ఒకరోజు అర్ధరాత్రి నిద్రతో సోలిపోతూ తూలుతూ మేడ మెట్లెక్కుతున్న మనోహర్‌ను నిలవేసింది పార్వతి, "మరీ ఇలా అయిపోతున్నారేమిటి ?" అంటూ.

"ఎలా అయిపోతున్నానూ?" అలాగే మత్తుగా నవ్వుతూ అడిగాడు మనోహర్.

"రాత్రిళ్లైనా వేళకు ఇంటికి రాకుండా స్టూడియోలే ఇల్లూ ఇల్లాలూ అయితే ఎలా ?" ఆ సరికే పార్వతి కంఠస్వరం బొంగురు పోయింది.

పరుపుమీద స్థిమితంగా పడుకొని, పార్వతిని తన పక్కకు లాక్కుంటూ ఫక్కున నవ్వాడు మనోహర్.

"మైడియర్ పార్వతీ! ఇది సినిమా ప్రపంచం! ఇల్లూ ఇల్లాలూ అనేవి గుర్తుంచుకుంటే, అడుగు ముందుకు వేయలేం!

అవతలవాడు మనల్ని నెట్టివేసి, మన నెత్తిన కాలువేసి మరీ పైకి వెళ్ళతాడు! మరో హీరో పైకి వచ్చాక మనపని ఖాళీ!''

"అందుకని ఆరోగ్యాన్ని కూడా పాడుచేసుకుంటారా? రాత్రింబగళ్లు ఆ వెధవలైట్లముందు, ఆ రంగులు పులుముకొని, ఆవేశం నింపుకొని నటిస్తుంటే, మీ శరీరం..." పార్వతి పెదవుల్ని దాటి మిగతా మాటలు పైకి రానివ్వకుండా మనోహర్ పెదవులు అడ్డుకున్నాయి.

"అస్తమానూ శరీరమూ, ఆరోగ్యమూ అంటూ మడి గట్టుక కూర్చుంటే సుఖమయ జీవితం ఎలా వస్తుంది?"

"ఇప్పుడు మనకేం లోటు?''

"పిచ్చిపిల్లా! ఇంకా పేరు రావాలినాకు. ఇంకా డబ్బు కావాలి...నువ్వు అడ్డుకోకు."

"అడ్డు రావటంలేదు. కానీ నా సంగతి కాస్త ఆలోచించండి. బంగారు పంజరంలో చిలకను అయిపోయాను."

"అదా కథ? ఏమీ తోచటం లేదంటావ్; అవునా? ఎలాగు ఈ నెలాఖరులో మా అమ్మా నాన్నగారు, మా అక్కయ్య ఆవిడ పిల్లలు అంతా వస్తారు. బోలెడంత సందడి నీకు...'' పార్వతి బుగ్గమీద చిటికెవేసి పక్కకు తిరిగి పడుకొని, క్షణంలో నిద్రపోయాడు మనోహర్.

మరో నెల తిరిగేసరికి మరింత బాధాకరంగా తయారయింది వాతావరణం. అత్తగారు, మామగారు, ఆడబడుచు, ఆమె బిడ్డలు వస్తే, ఇల్లంతా సందడిగా వుంటుందనీ, సరదాగా

రోజులు దొర్లిపోతాయనీ వూహించిన పార్వతికి, ఎదుర్కొన్న సమస్యలు వూపి వేస్తున్నాయి. నాలుగురోజులు పరస్పర గౌరవాలతో, మొహమాటాల్తో గడిచిపోయాయి. అంతే; ఐదోరోజునుంచీ ఇంటి అజమాయిషీ అంతా అత్తగారు స్వాధీనం చేసుకుంది. ఇంటినిండా ఇన్నిరకాల వస్తువులెందుకు? ఇంత మంది నౌకర్లెందుకు? అంటూ ఆవిడ ఒకటేగోల. ఆడబడుచు రామలక్ష్మిది విచిత్ర స్వభావం. ప్రతి చిన్న వస్తువునూ అతిగా పరీక్షించి వ్యాఖ్యలు చెయ్యటమే ఆమె కార్యక్రమం. 'నాకు తెలియకడుగుతాను పార్వతీ! మీ పుట్టింటి వారు ఏమంత కలిగినవారు కాదుకదా? మా తమ్ముడి దగ్గరకొచ్చాక ఇంత దుబారా నేర్చుకున్నా వేమిటే?' అంది రామలక్ష్మి పార్వతి గది పరికించి చూస్తూ. మనసు చుర్రుమన్నా, మమత అడ్డొచ్చి నవ్వి వూరుకుంది పార్వతి. 'అయినా! ఎంత సిరి తరుముకు వస్తే మాత్రం ఇన్ని రకాల నగలా? రాళ్ళవి, కెంపులవీ, బంగారువీ! అయ్యబాబోయ్! కాకున్నా నిన్ననుకుని ఏం ప్రయోజనం? మన బంగారం మంచిదయితే అన్నట్లు...మా వాడికే లేవు తెలివితేటలు? ఇందులో నాలుగో వంతయినా నాకూ, నా పిల్లలకూ, మిగతా చెల్లెళ్ళకూ, వాళ్ల పిల్లలకూ చేయించాలనే ఆలోచన వాడికి కలిగిందా?'

ఇలాటి మాటలకు విసుర్లకు అంతే లేకుండా పోతోంది. రెండు రోజులకు మూడు రోజులకు ఒకసారి ఏ అర్ధరాత్రికో యిల్లు చేరుతున్న మనోహర్ కివేమీ చెవికెక్కటం లేదు. ఎక్కినా పట్టించుకునే తీరిక, ఓపికా, ఆసక్తి కూడా లేవు.

అతడూ. అతడి కాంట్రాక్టులూ, అతడి షూటింగులూ, అతడి సినిమాలూ అదే లోకం!

ఉద్యోగరీత్యా మద్రాస్ చేరీన రెండవ ఆడబడుచూ, పిల్లలూ, భర్తాకూడా, మకాం మనోహర్ ఇంటికి చేర్చారు. మనోహర్ కు తమ్ముడు వరసయ్యే దూరపు బంధువు రామ్మోహన్, అతని భార్యా, పిల్లలు కూడా బస మనోహర్ ఇంట్లోనే ఏర్పాటు చేసుకున్నారు.

ఎక్కడెక్కడో బీరకాయపీచు సంబంధాలు ఏర్పరచుకొని వస్తున్న ఈ బంధువుల్ని చూస్తుంటే పార్వతికి అసహ్యామూ, అసహనమూ కూడా కలుగుతున్నాయి. బెల్లం చుట్టూరా ఈగలు మూగినట్లు ఈ బంధువులలో ఏ ఒక్కరూ మనోహర్ కు ఆప్తులుకాదు నిజానికి.

అస్తమాను ఇంట్లో హోరుమని గోల, ఆడంగుల కబుర్లు, వ్యాఖ్యలు, తగవులు, మధ్యమధ్య పార్వతి అదృష్టాన్ని గురించిన అసూయా పూరిత వాగ్బాణాలు వినలేక పార్వతికి చెవులు దిబ్బళ్ళు పడిపోతున్నాయి. రామలక్ష్మి పిల్లలు రేడియోగ్రాం పాడుచేశారు. కేక లేసింది పార్వతి. అదో రగడకు దారితీసింది.

"కుక్కను సింహాసనంఎక్కిస్తే మరేమవుతుందీ? ఏనాడూ బంగళాముఖం కూడా చూడనిదాన్ని నెత్తినెక్కించుకొని అన్నీ అమర్చాడు మా వాడు! నడమంత్రపుసిరీ, నరాలమీది పుండూ నిలువనియ్యదని ఊరికే అన్నారా? లక్షలకొద్దీ వాడు సంపాదిస్తున్నా, వెధవ వెయ్యి రూపాయల రేడియోగ్రాం పాడయిం

దని నా పిల్లల్ని కేకలేస్తావా ? అవునుమరి ! నా భర్త స్కూలు మాస్టరాయె ! నువ్వా సినిమా హీరో భార్యవయితివి ! మరి మేమూ మా పిల్లలూ కంట్లో నలుసుల్లా కనిపించక ఏమౌతాము ?" అంటూ అక్షర సముదాయ మంతా కూడదీసి వాక్యాలుగా విడదీసి, వేడిగా, వాడిగా బాణాలు రివ్వురివ్వున రోజంతా విసురుతూనే వుంది రామలక్ష్మి. వంతపాడారు అత్త గారూ చిన్నాడబిడ్డ !

"వదినా ! మిమ్మల్ని నమ్ముకునివచ్చాను. మనోహర్ అన్నయ్యతోచెప్పి నాకు ఏ సినిమాలోనైనా వేషం ఇప్పించేలా చూడండి..."

రామ్మోహన్ సందు దొరికినపుడల్లా కాళ్లూ వేళ్లా పడ్తున్నాడు.

"నేనేం చెయ్యను రామ్మోహన్ ? చూస్తూనే వున్నావుగా ! మీ అన్నయ్యగారు ఏ రెండుమూడు రోజులకో ఇంటికి వస్తారు. ఆ వచ్చినకాస్సేపూ విశ్రాంతి తీసుకుంటారు... పోనీ వీలుచూచుకుని నువ్వే మాట్లాడు" అంది పార్వతి, నెలలు నిండడంవల్ల కలుగుతున్న అయాసాన్నీ, ఇంట్లో అశాంతిమయ వాతావరణం వలన కలుగుతున్న ఆవేదననూ అదుపులో పెట్టుకుంటూ.

"అలాకాదొదినా ! అన్నయ్యతో నేను చెప్పటమూ, మీరు చెప్పటమూ ఒకటౌతుందా ? రామదాసంతటి వాడు 'నను బ్రోవమని చెప్పవే సీతమ్మతల్లీ !' అని వేడుకున్నాడు. సీతమ్మను." తన వాక్చాతుర్యానికి తనే నవ్వుకుంటూ అన్నాడు రామ్మోహన్.

"చూద్దాంలే !" అంది పార్వతి గదిలోకి వెళ్లిపోతూ.

ఇలా రామ్మోహన్ ఒక్కడే కాదు... ఎవరెవరో గృహిణులూ, గృహస్థులూ తమ పిల్లలకు సినిమాలలో ఛాన్సు లిప్పించ వలసినదిగా రెకమండ్ చెయ్యమని పార్వతిని అర్థిస్తున్నారు. పార్వతి వాళ్ళను చూచి జాలితో తనమీద తనక్కలిగే అసహ్యంతో సతమత మౌతోంది. తన బాధలు వెళ్ళబోసుకోటానికి భర్తసాన్నిధ్యం దొరకటమే కష్టంగావుంది.

ఎంత అశాంతిమయ పరిస్థితులలో నయినా ఎంతటి శారీరక శ్రమనయినా స్త్రీ కొద్ది క్షణాలు భర్త బాహువుల స్పర్శలో మరచిపోగలదు. కానీ తనకు మనోహర్ దర్శనమే అపురూప మవుతోంది రానురాను... చావబోతున్న భక్తుడికి భగవంతుని సాక్షాత్కారంలా ఏ అర్థరాత్రో అరగంట తనతో మాట్లాడ్తాడు...అదీ ఇంటికి వస్తే!

ఆ సమయంలో ఇంట్లో గొడవలే చెబుతుందా? రామ్మోహన్‌లాంటి వారి అభ్యర్థనలే విన్నవిస్తుందా? ఆద మరచి అతడి హృదయంలో ఇమిడిపోతుందా?

ధైర్యంచేసి ఒకసారి హెచ్చరించింది. "ఇంట్లో గోల ఇలావుంది" అని. ఛర్రుమన్నాడు మనోహర్. "ఎవ్వరూ లేనప్పుడు, ఎవరూలేరనీ, తోచడంలేదనీ గొడవచేశావే! తీరా ఇప్పుడు వాళ్ళందరూ ఏదో చేస్తున్నారనీ, నిన్ను అంటున్నారనీ గోలచేస్తున్నావ్! అబ్బబ్బ! స్టూడియోల్లో విసిగి వేసారి ఇంటికివస్తానా? చెవిలో నీ కాకిగోల! అసలికమీదట రావటమే మానుకుంటాను......"

"అంతపని చెయ్యకండి" రుద్ధకంఠంతో బ్రమాలుకుంది పార్వతి.

"అయితే మరెప్పుడూ ఇంటిగొడలు నాకు చెప్పకు..."

ఆ అంకం అలాముగిసింది. మరోమారు -

"రామ్మోహన్ కేదేనా సినిమాలో వేషం ఇప్పించమని" అనబోతున్న పార్వతిమాటలు పూర్తికాకుండానే మనోహర్ అందుకున్నాడు. "...నిన్ను నాతో చెప్పవలసిందిగా ప్రయోగించాడు, అవునా ?"

"ఊఁ !"

"పార్వతీ ! ఇప్పటికేదో వూరుకున్నానుగానీ, మరెప్పుడూ ఇలాటి విషయాల్లో తలదూర్చకు..."

విస్మయంగా చూచింది పార్వతి. తను చెప్పిన విషయంలో తప్పేమిటో బోధపడలేదామెకు.

"రామ్మోహన్‌లో ఏముందని సినిమాల్లో వేషం ఇప్పించాలి ? అందమా ? పర్సనాలిటీయా ? నటనా ?" మనోహర్ కసిగా అన్నాడు.

"ఈనాడు సినిమాల్లో నటించే వారందరూ పుట్టుకతోనే పరిణితులైన నటులా ? లేక నవమన్మథులూ, అభినవరంభలూనా ?" అంది పార్వతి వుండబట్టలేక.

మనోహర్ కోపంగా చూచాడు పార్వతివేపు ... అయినా సమాధానం చెప్పాడు.

"పార్వతీ ! నీ కెలా చెప్పాలో బోధపడటంలేదు. ఒక సారి చెప్పాను నీకు గుర్తుందా ? ఇది సినిమారంగం, చాలా వరకు జలచరజాతికి చెందిన మానవులే ఈ రంగంలో రాణిస్తారు..."

"అంటే...?"

"సముద్రంలో నివసించే ప్రాణుల జీవనవిధానం ఎలా వుంటుందో తెలుసా ? చిన్నచేపను పెద్దచేప, పెద్దచేపను మరో పెద్దచేప, ఆ పెద్దచేపను తిమింగలం. ఇలా తనకంటే చిన్న ప్రాణిని, పెద్దప్రాణి పొట్టనబెట్టుకుని జీవనం సాగిస్తుంటాయి. ఈనాడు మానవులుకూడా నైతికంగా, మానసికంగా, ఇలాగే తయారయ్యారు. మనిషిని మనిషి ఆపళంగా నమిలి మింగటం లేదుగానీ, మరోమార్గాలలో పీల్చిపిప్పిచేస్తున్నాడు. పేదవాళ్ళ కడుపులుకొట్టి మేడలు, కార్లు షికార్లు చేస్తున్నాడు ధనవంతుడు. అలాటి ధనవంతుల నెందరినో కొల్లగొట్టి, అది ప్రజాసేవ పేరిట ప్రచారం చేస్తున్నారు కొందరు రాజకీయవాదులు. ఇలాటి రాజకీయ వాదుల్ని అసరాగాచేసుకుని తమ స్వప్రయోజనాలు చూచుకుంటున్నారు కొందరు స్వార్థపూరితులైన దేశనాయకులు. ఇలాటి ఎన్నో ప్రభుత్వాలను కొల్లగొట్టి తమ దేశాలు భాగ్యవంతంగా, బంగారు గనులుగా మార్చుకొంటున్నాయి మరికొన్ని దేశాలు..."

"ఇవన్నీ బాగానే వున్నాయి..." పార్వతి ఏదో చెప్పబోయింది. మనోహర్ వారించాడు.

"నన్ను చెప్పనీ! ఇలా మానవ జీవనస్రవంతిలో పరవంచన, పరపీడన ప్రధాన భాగాలయిపోయాయి..."

"కానీ సినిమా ప్రపంచంలో కష్టపడి పైకివచ్చిన వాళ్ళదే పైచేయ్యుంటూరు...'' అంది పార్వతి.

"అదే నీ పొరపాటు...వున్న కిటుకే ఇక్కడుంది. ప్రతి నిర్మాతా డబ్బుచేసుకోవటం సహించలేడు. అందుకు అవకాశం వుంటే అష్టదిగ్బంధన చేస్తాడు. ప్రతి గాయకుడూ, గాయనీ, తాము తప్ప మరో గాయనీ, గాయకులు పైకిరావటం అంగీక రించరు. అందుకోసం కంఠనాళాలు పగిలిపోతాయనేనా లేకుండా, ప్రతిచిత్రంలో తామే పాడాలని పోటీపడతారు. ప్రతి డైరెక్టరూ, తనక్రింద పనిచేసేవాళ్ళు డైరెక్టర్లయి పోకుండా ఓ కంట కనిపెడ్తుంటాడు. ప్రతినటీ, నటుడూ తను కంటే, బాగానటించి మరెవరేనా పేరు తెచ్చుకుంటారేమోననే భయంతో వూపిరిసలపనంతటి పనివున్నా, అన్ని చిత్రాలలో తామే నటించేందుకు ఒప్పేసుకుంటారు..."

పార్వతి ఆశ్చర్యంగా వింటోంది.

"అలా విస్తుపోతావేం పార్వతీ! ఎవరిభయం వారిది. ఎవరిస్వార్థం వారిది. ఎవరిఆశ వారిది. ఎవరిలాలస వారిది. ఇందులో పక్కవాడికి చోటులేదు. స్థానం ఇవ్వరు. సానుభూతి చూపించరు. సహకరించరు. అవునుమరి! పక్కవాడికోసం, వాడి అభివృద్ధికోసం పాటుపడ్తూ కూర్చుంటే, వీడిగతి అధోగతి కావచ్చు. ఈరోజున్న గ్లామర్ రేపు లేకపోవచ్చు. లేదా మరెవరేనా ఆ అవకాశాలను తన్నుకుపోయి ఇతగాడి తలదన్ని పోవచ్చు..."

"అయితే మీరుకూడా...?" పార్వతి ఆశ్చర్యంగా అడగబోయింది.

"...ఆఁ! ఆ కోవకు చెందినవాణ్ణే నేనుకూడా! నాలోనూ స్వార్థం వుంది! నాలోనూ కీర్తికండూతి, ధనదాహం, సుఖలాలస వున్నాయి. ఈ నాడు నేను నీ మాటవిని రామ్మోహన్‌కు అవకాశమిస్తే రేపు మరొకరి కివ్వాలి... ఇలా నాచుట్టూరా నన్నుమించిన నటుల్ని నేనే తయారుచేస్తే, నా ముఖం చూచేదెవరు? నా చుట్టూరా నేనే గోతులు త్రవ్వుకునేంతటి తెలివితక్కువవాణ్ణి కాను పార్వతీ! ఇదేసంగతి చెప్పు రామ్మోహన్‌తో..."

నిర్ఘాంతపోయిన పార్వతి తేరుకునేసరికి మనోహర్ వెళ్ళిపోయాడు. రామ్మోహన్ ప్రత్యక్షమయి వున్నాడు.

"ఒదినా! అన్నయ్యతో నా సంగతి చెప్పారా?" అన్నాడు.

క్షణకాలం అయోమయావస్తలో పడిపోయింది, పార్వతి. మనోహర్ పెద్దఉపన్యాసం ఇచ్చి వెళ్ళిపోయాడు. జలగలా రామ్మోహన్ విడవకుండా తనను పట్టుకున్నాడు. మనోహర్ చెప్పిందంతా తను రామ్మోహన్‌కు చెప్పగలదా? తనభర్త నంత స్వార్థపూరితునిగా, సంకుచిత స్వభావునిగా తనే చెప్పుకోగలదా? తనద్వారా పని సాధించుకుని, ఐశ్వర్యంలో మునిగి తేలాలని ఆకాశహర్మ్యాలు నిర్మింతుకొంటున్న రామ్మోహన్‌కు తనేం చెప్పాలిప్పుడు?

"ఒదినా! ఏమన్నారన్నయ్య?" రామ్మోహన్ తిరిగి ప్రశ్నించాడు.

"ఏమంటారు రామ్మోహన్! ప్రస్తుతం అవకాశా లేమీ లేవట! ఉన్నప్పుడు తప్పక చూస్తామన్నారు..." కర్ర విరగకుండా, పాము చావకుండా సమాధానం చెప్పి తప్పించు కుంది పార్వతి.

"అవున్లెండి వదినా! నే నెక్కడివాణ్ణి? అసలు మీరు అన్నయ్యతో గట్టిగా చెప్పివుండరు. అవునుమరి! నేనేం మీ స్వంత మరిదిని కాదు. తమ్ముణ్ణీ కాను. నా విషయంలో మీకు శ్రద్ధవుండాల్సిన అవసరము లేదు...నా పిచ్చేగానీ..." ఇంకా ఏమేమిటో గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు రామ్మోహన్.

"భగవాన్!" నిట్టూర్చుతూ కూలబడిపోయింది పార్వతి. ఇంట్లోజనం ఎక్కువయ్యేకొద్దీ, పార్వతి పరిస్థితి మరింత ఇరకాటంగా తయారయింది.

"చూడమ్మాయ్ పార్వతీ! ఒకవేళ మగవాడు సినీమాల్లో వేషం వేస్తున్నాడే అనుకొందాం! ఇంటికైన ఆడది కాస్త అణకువ కలిగివుండాలి! నువ్వా సినిమాల్లో వేషంవేసే దానిలా ఆ కట్టూ బొట్టూ ఏమిటీ? అందునా చిన్నపిల్ల వేషం కాదు. ఆరేళ్ళ కొడుకుకూడా నాయె!'' సరదాగా కట్టుకున్న సన్నని చెమ్కీ చీరెగురించి అత్తగారి వ్యాఖ్య!

''నీ కెందుకే అమ్మా! ఆవిడ ఇష్టం. ఆయనగారు లక్షలు సంపాదిస్తున్నారు. ఆవిడ అనుభవిస్తోంది. మధ్య మన మెవరం అడగటానికీ?'' చిన్నాడబిడ్డ సాధింపు.

"ఈ వేళప్పుడు బీచి కేమిటొదినా? ఇంట్లో మే మింతమందుండగా నీకు తోచటం లేదా ఏమిటి?" అత్తగారి

ఆసరాతో వచ్చి ఇంట్లో పీఠంవేసిన దూరపు బంధువు రాజ్యం ! ఆశ్చర్యం ! ఒక్కసారిగా పేలిపోయింది పార్వతి.

"మీ కెందుకు ? నా యిష్టం ! నా యింటికొచ్చి నా మీద అధికారం చెలాయించటానికి మీకేం హక్కున్నది ? అట్టే వాగకండి ! లేదా అవతలకి నడవండి !"

పార్వతి నోటినుంచి ఇన్నిమాటలు ఊహించని వారంతా నిర్ఘాంతపోయారు. తాత్కాలికంగా సద్దుమణిగిందేగానీ, మనోహర్ పార్వతి గోడవేదీ పట్టించుకోడని రూఢి కాగానే ఎవరి స్థానాల్లో వారు తిరిగి విజృంభించారు.

* * *

"పార్వతీ ! మరో బంగళా కొన్నాను ... మనం యిక ఆ బంగళాలోకి మకాం మార్చేద్దాం!" అన్నాడు మనోహర్, ఏనాడు లేంది ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకే ఇంటికి వచ్చి. ఆశ్చర్యపోయింది పార్వతి. నమ్మలేనట్లున్నాయి ఆమె చూపులు.

"ఎంత నేను పనుల్లో మునిగివున్నా నీ పరిస్థితులు గమనిస్తూనే వున్నాను...వీళ్ళంతా ఈ కొంపలోనే పడుంటారు. అవసరమైన డబ్బు వాళ్ళ ముఖాన పారేస్తాను. హాయిగా మనిద్దరం, మనబాబూ రామకృష్ణ వేరే బంగళాలోకి వెళదాం !'"

"అవును కాదు" అనే జవాబులకు అవకాశమివ్వకుండా, మరునాటికల్లా మరో బంగళాలోకి సామాన్లనీ, పార్వతీ రామకృష్ణలనీ చేర్పించేశాడు మనోహర్. అక్కడికి వచ్చాక తాత్కాలికంగా కొంత ఉపశాంతి కలిగింది పార్వతికీ. అన్త

మానూ రగడలూ, సూటీపోటీ మాటలూ విన్పించటం లేదు. రామకృష్ణను కాన్వెంటులో చేర్పించాడు మనోహర్. అంత వరకూ బాగానే వుంది.

*   *   *

"అమ్మా! అమ్మా! వెళ్దాంరామ్మా!" రామకృష్ణ తల్లి రెండు భుజాలుపట్టుక కుదుపుతున్నాడు. ఉలికి పడింది పార్వతి. త్రివర్ణ పతాక రెపరెపలాడుతోంది. తెరమీద "జణగణ మన" అంటూ జాతీయగీతం ట్యూను వినిపిస్తోంది. సినిమా అయిపోయిందన్న మాట! పార్వతికి ఆశ్చర్యంతో బాటు తన మీద తనకే జాలి ముంచుకవచ్చింది. ఈ మూడుగంటలూ ఒక్క రీలయినా సినిమా చూళ్లేదు సరికదా పదమూడు సంవత్సరాల క్రితం నుంచీ జరిగిపోయిన జీవిత ఘట్టాలన్నీ సినిమాలా తను మనసులో చూస్తోంది. యాంత్రికంగా కారులోఎక్కి కూర్చుంది.

"నాన్నగారు చూడమ్మా! ఎంచక్కా నటించారో! ఆ జలపాతం దగ్గర స్టంట్ సీనులో అయితే మరీను! అమ్మా! అంతగట్టిగా కొట్టుకోవడంలో నాన్నగారికి దెబ్బలుతగలవా?" రామకృష్ణ ఉత్సాహంగా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు. జవాబులిచ్చే స్థితికాదు. కనీసం శ్రద్ధతో వినిపించుకునే పరిస్థితిలో కూడా లేదు పార్వతి. మళ్ళీ ప్రస్తుత సమస్య భయంకరంగా కళ్ళముందు పరుచుకూర్చుంది. సరోజ వస్తుంది. ఎన్నో ప్రశ్నలు వేస్తుంది. అందులో మనోహర్ వివాహ ప్రసక్తికూడా వుండొచ్చు. తనేం సమాధాన మిస్తుంది? "నువ్వు ఆదర్శ గృహిణివి, త్యాగమూర్తివి" అంటూ పొగిడేస్తుంది కాబోలు! అవి వింటూ తనెలా సహించగలదు?

రామకృష్ణ వెళ్ళి పడుకుని ఐదు నిమిషాల్లో మంచినిద్ర లోకి జారాడు. నౌకర్లు తలుపులన్నీ వేసి క్రిందివరండాలో పడుకున్నారు. గూర్ఖా జాగ్రత్తగా కాపలా కాస్తున్నాడు... పార్వతికివేవీ పట్టటంలేదు! పార్వతికి పట్టుకున్న బాధల్లా ఒకటే! సరోజ వస్తుంది. కాలేజీ రోజుల్లో ప్రాణంతో సమా నంగా వుండిన సరోజదగ్గర తను ఇవన్నీ దాచగలదా? అన్నిటి కంటే ముఖ్యమయిన వారి వివాహ విషయం దాచగలదా? తెల్లవారుఝామున తలపగిలిపోతుంటే లేచి 'ఆస్ప్రో' వేసుకుని, పడుకున్న పార్వతిని నిద్రాదేవి దయతలచింది.

ఇంద్రధనస్సులా వెలుగుతున్న బంగళానూ, పూల తోటనూ, గిరగిర తిరుగుతున్న ఫౌంటెన్‌నూ వింతగా చూస్తూ, "ఎన్ని నోములు నోచావో ఇంతటి అదృష్టం దక్కించుకోవటా నికి!" అనుకుంది సరోజ.

'రా సరూ!' అంది పార్వతి వరండా మెట్లమీదనిల్చుని. ఇద్దరూ పరస్పరం చూచుకుంటూనే రెండు నిముషాలు గడిపే శారు. పార్వతి సరోజలో శారీరకంగా వచ్చిన మార్పును ఆశ్చర్యంగా చూస్తూంది. తనను గుర్తించి ఇంత సాదరంగా ఆహ్వానిస్తుందో లేదోనని సందేహిస్తూ వచ్చిన సరోజ, పార్వతి నిరాడంబరతకూ, అతిశయంలేని ఆమె పిలుపుకూ ఆశ్చర్యంగా చూస్తూంది.

బాల్యస్నేహపు కబుర్లలో మునిగిపోయారు ... చుట్టూరా అందమయిన లేత నీలిరంగు తెరలు రెపరెప లాడ్తు న్నాయి.

"నే నొక్కమాట అడుగుతాను ... నిజం చెబుతావా పార్వతీ !" అంది సరోజ హఠాత్తుగా.

గుండె గుభేలుమంది పార్వతికి. తను భయపడ్తున్న ప్రశ్నే వేస్తుంది కాబోలు...

"మీ వారు మరో పెళ్ళి చేసుకుంటుంటే నీకు బాధ కలగ లేదూ ?'' సరోజ నిశితంగా చూస్తూ అడిగింది.

"అబ్బే ! బాధెందుకూ ?" లేని నవ్వునూ, రాని గంభీరతనూ తెచ్చి పెట్టుకుంటూ అంది పార్వతి.

విస్మయంగా చూచింది సరోజ... "ఏమో బాబూ ! నేను మాత్రం సహించలేను. నీ కున్నంత త్యాగం నాకు లేదు...'' అనేసింది మళ్ళీ. రెండు మూడు నిముషాలు మౌనంగా దొర్లి పోయాయి. తిరిగి చూచిన సరోజ త్రుళ్లిపడింది.

పార్వతి కళ్ళలోని నీరు చెక్కిళ్ళమీదుగా కారుతోంది.

"పార్వతీ ! కన్నీళ్ళా ? నీకా ! నీ కూడా కన్నీళ్ళు పెట్టుకోనే అవకాశా లున్నాయా ?" ఆశ్చర్యంగా అంటూ పార్వతి దగ్గరగా వచ్చింది సరోజ.

"వున్న వే అవి ! మిగిలినవే యివి !'' పార్వతి రుద్ధకంఠం సరోజను కలవర పరుస్తూంది...

'నిజం చెప్పు పార్వతీ ! ఇంత ధనం, అంతస్తు, హోదా అన్నీవున్న నీకూ దుఃఖకారణా లంటూ వున్నాయా ? నాతో చెప్పవూ ?''

"పార్వతి శుష్కహాసం చేసింది... నువ్వేకాదు కాలం క్రితం అందరూ అలాగే అనుకుంటూరు నన్ను గురించి. అంతస్థాయి ధనమూ, వీటన్నిటి వెనుకావున్న నా జీవితం ఎవరికర్థమౌతుంది? ఈ రంగుల తెరవెనుక జరిగే విషయాలు, వాటిలోని నిజాలు ఎవరు గ్రహిస్తారు? పై పెచ్చు నేను త్యాగమూర్తినని బిరుదు. తన భర్తను తనంత తానుగా మరొక స్త్రీ కధీనం చేసే స్త్రీ వుంటుందా ఎక్కడేనా?"

"అంటే నీ ప్రమేయం లేకుండానే మీ వారు మరో పెళ్లి చేసుకున్నారంటావు...? మరింత సంభ్రమంగా ప్రశ్నించింది సరోజ."

'ఆఁ! కానీ బయటి ప్రపంచానికి మాత్రం నేను సంపూర్ణ సహకారమూ, దీవెనా ఇచ్చి మరీ వివాహం చేయించినట్లు వెల్లడి చేసారు...'

'అంటే?'

"వివరంగా చెబుతాను విను సరోజా! ఇంతకాలమూ మనసు విప్పి చెప్పుకునే సాహసమూ, చెప్పుకోదగ్గ మనిషీ కనిపించలేదు. ఈ రోజు లోపల భరించేశక్తీ నాకు లేదు..." పార్వతి లోపలికి వెళ్ళి ఫొటో ఒకటి తెచ్చి సరోజ కిచ్చింది.

ఫొటోలో మనోహర్ నవ్వుతున్నాడు. ఇంచుమించు అతడిమీద వాలిపోయి మత్తుగా నవ్వుతోంది మరో అమ్మాయి. ఇద్దరిమధ్యా నాలుగు సంవత్సరాల వయసుండగల బాబు నిల్చుని వున్నాడు.

"ఈవిడ...?"

"ఊఁ! ఇప్పుడిప్పుడే పైకివస్తున్న నటీమణి! వారు... షారుసుగా మావారు... ఆ పిల్లాడు వాళ్ళిద్దరి పుత్రుడు... ఆవిడపేరు రాధ!"

"అసలు నువ్వెందు కొప్పుకున్నావ్ పార్వతీ? కేసు పెట్టాల్సింది!" సరోజ రోషంగా అంది.

'ఎవరిమీద? నా దురదృష్టంమీదా?'

సరోజ పలకలేదు! మౌనంగా వింటోంది. పార్వతి వాక్ప్రవాహం అడ్డులేకుండా సాగిపోయింది.

* * *

కొత్తగా కొన్న బంగళాలోకి మకాంమార్చాక పార్వతి కొంత కుదుటపడింది.

ఆరోజు...రాత్రి ఏడుగంటల ప్రాంతంలో మనోహర్ ఇంటికి వచ్చాడు... కారులోంచి పూలబుట్టలు నౌకర్లచేత పట్టించుకు వచ్చాడు. విస్మయంగా చూస్తున్న పార్వతిని మేడ మీదకు పిల్చికెళ్లాడు.

"చూడుపార్వతీ! ఆ పూలమాలలన్నీ నా బెడ్‌రూంలో అందంగా అమర్చాలి... నువ్వే స్వయంగా చెయ్యాలీపని! నేను మరోగంటలో వచ్చేస్తాను..." అన్నాడు.

"ఎందుకూ? ఏమిటిదంతా!..." అంటూ ప్రశ్నించ బోయిన పార్వతికి సమాధానంగా, ఆమెచెక్కిళ్ళు ఎరుపెక్కేలా పెదవుల ముద్రలుంచి, హుషారుగా ఈలవేసుకుంటూ తిరిగి కారులో వెళ్ళిపోయాడు మనోహర్!

రామకృష్ణ పుట్టకముందు ...... కొంతకాలం క్రితం మనోహర్ తనతో గడిపిన మధుర సన్నివేశాలు గుర్తుకొచ్చాయి పార్వతికి... హుషారుగా నడిచి పూలమాలలన్నీ ఒక్కొక్క టిగా పడకచుట్టూరా అమర్చింది... క్రింద కారాగిన చప్పుడు కావడంతో మెట్లవరకూ వచ్చి ఆగింది.

మనోహర్, రాధ చెయ్యిపట్టుక మెట్లెక్కివస్తున్నాడు... ఎందరో స్త్రీలతో పరిచయమున్నవాడు, అందునా నటుడూ, అయిన తనభర్త అలా పరస్త్రీని వెంటబెట్టుక రావటం ఆశ్చ ర్యాన్ని కలిగించలేదు కానీ, అలా చెయ్యిపట్టుకు నడిచిరావ టంలో మాత్రం ఏదో విలక్షణత గోచరించింది పార్వతికి.

"పార్వతీ! అలాచూస్తావేం? ఈవిడ రాధ..." అన్నాడు మనోహర్ నవ్వుతూ.

"తెలుసు!..." నవ్వటానికి ప్రయత్నిస్తూ అంది పార్వతి.

"ఈ నిముషంనుంచీ నీ చెల్లాయి!" అన్నాడు మళ్ళీ.

"అంటే ?..."

ఏదో అడగబోయిన పార్వతిని వారిస్తూ "కబుర్లు తర్వాత...ముందు రూంలోకి వెడదాం పద!" అన్నాడు మనో హర్ పడకగదిలోకి రాధతో ప్రవేశిస్తూ.

పార్వతికి కొంత అర్థమయింది... మరికొంత అర్థం కాలేదు...

"చూశావా రాధా! నే చెబితే నమ్మావుకదు... మా పార్వతి దేవత! నేను నిన్ను వివాహం చేసుకుంటానని చెబితే, ఒక్కమాటనలేదుసరికదా, ఆనందంతో అంగీకరించింది. నిన్ని

ప్పుడు పిల్చుకొస్తానని తెలియగానే, మనకోసం గదంతా ఎలా అలంకరించిందో చూడు !''

పార్వతి నిర్ఘాంతపోయింది. అసలు ఆవిడను వివాహం చేసుకోబోతున్నట్లు తనతో మనోహర్ మాటమాత్రం చెప్పాడా ? ఆ మాటవిని తను ఆనందంతో అంగీకరించిందా ? ఇప్పుడీ గదంతా వాళ్ళిద్దరికోసమని అలంకరించిందా ? ఇక తన గతేమిటి ? తన స్థానమేమిటి ? రామకృష్ణ భవిష్యత్తేమిటి ? పార్వతి తల గిర్రున తిరిగిపోతోంది. గదంతా తిరిగిపోతున్నట్లు అనిపిస్తోంది, ఆ బాధలో, ఆవేదనలో అయోమయావస్థలో—

రాధ "అక్కయ్యా ! మీకు మేము చాలా ఋణపడి వుంటామండీ !" అని కులుకుతూ హాయలు చిలుకుతూ, చిలకలా పలకటంగానీ,

మనోహర్ "ఇకమీదట వీలైనప్పుడల్లా రాధ ఇక్కడికి వస్తూనేవుంటుంది... మీ రిద్దరూ సఖ్యంగా..." అంటున్న మాటలుగానీ స్పష్టంగా విన్పించలేదు...

కళ్ళుతెరచి చూచేసరికి పక్కగదిలో తన పడకమీద వుంది పార్వతి. తన మంచానిక్కాస్త దూరంలో పనిమనిషి లక్ష్మి గుర్రుపెడుతోంది. పడకగదిలోంచి కిలకిల రాధనవ్వూ, గుసగుస మనోహర్ గొంతూ స్పష్టంగా వినిపిస్తున్నాయి !

పక్కమీద లేచి కూర్చున్న పార్వతికి తను ముళ్ళకంపలో పడివున్నట్లుంది. షూటింగులనీ, నటనలనీ ఇంతకాలం ఇల్లుపట్టక తిరుగుతున్నా, తననసలు నిరాదరించినా, తనెలాగో ఓర్చుకో గలిగింది ! కానీ ఈనాడు ! తన కళ్ళెదుట... మరో స్త్రీని

వివాహమాడి తనింటికే తీసుకవచ్చాడు! అంతటితో ఆగక ఆ వివాహానికి తన ప్రోత్సాహము, సహకారము వుందనికూడా ప్రచారం చేస్తున్నాడు... ఈ సరికి ఈ వివాహ విషయం అన్ని పత్రికలలోకి ప్రాకిపోయుంటుంది! తను నిజం చెప్పినా నమ్మేనాథుడెవరు?' పై పెచ్చు తనకు పిచ్చి పట్టిందని తనభర్తే నలుగురికీ చెప్పొచ్చుకూడా! పక్కనే మరో మంచం మీద పడుకొని నిద్రపోతున్న రామకృష్ణను చూస్తూంటే దుఃఖం కట్టలు తెంచుకుంది పార్వతికి! తన జీవితంతోనే వాడి జీవితము తెరమరుగు అయ్యిందీనాడు; ఇక రాధకూ, పుట్టబోయే ఆవిడ సంతానానికి వున్న ప్రాముఖ్యత తనకూరాదు... రామకృష్ణకూ లేదు...

"అమ్మాగోరూ! లేచిరా? ఓవల్టీను తాగుతారా? తలతిరిగి పడిపోయారంట మీరు, అయ్యగారు చెప్పారు?" లక్ష్మి హఠాత్తుగా మేలుకుని కళ్ళు నలుపుకుంటూ చెబుతోంది.

"ఏమీ అక్కర్లేదులే, నువ్వు పడుకో!"

ఆ కాళరాత్రి తర్వాత వరుసగా అన్నీ అలాంటి రాత్రులే!

*            *            *

రాధ బాగా పెద్ద తారయి పోయింది. ఆవిడే స్వయంగా మరోబంగళా తీసుకుంది. తీరిక సమయాల్లో మనోహర్ రాధ ఇంట్లోనే గడుపుతాడు.

"నిజం చెప్పండి! నేను మీ వివాహానికి ప్రోత్సహించానా? అసలు నేనుండగా ఆవిడ నెందుకు వివాహమాడారు? అలాంటి

వారు నన్నెందుకు పెళ్ళి చేసుకున్నట్లు!" చాలరోజుల తర్వాత ఇంటికివచ్చిన భర్తను దీనంగా అడిగింది పార్వతి.

అందుకు సమాధానంగా పెద్ద ఉపన్యాస మిచ్చాడు మనోహర్!

"పార్వతీ! పిచ్చిదానా! నువ్వు ప్రోత్సహించినా, అంగీకరించినా, అంగీకరించకున్నా, నేను రాధను వివాహ మాడ దల్చుకున్నాను. అలాటి సమయంలో కేవలం నిన్ను స్వార్థపూరితురాలిగా, భర్తమాట కడ్డుచెప్పే గడుసుభార్యగా చిత్రించ దల్చుకోలేదు. అసలలాటి వాస్తవానికన్నా, ఇప్పుడు నా ప్రచారంవల్ల నీ కీర్తి ఎంత పెరిగిందో నీకు తెలుసా? మా వివాహం నువ్వు విశాల హృదయంతో జరిపించావని నిన్ను తెగ పొగుడుతున్నారంతా. ఇక నిన్నెందుకు పెళ్ళిచేసుకున్నా ననికదూ నీ బాధ? సాంసారిక జీవనంలో 'భార్య' అనే వ్యక్తి తప్పనిసరి కాబట్టి నిన్ను పెళ్ళిచేసుకున్నాను. ప్రస్తుతం సొసైటీలో తిరిగేందుకు నా పక్కన నువ్వు పనికిరావు... వయస్సుకంటే మనిషివి వడలిపోయావు. నీలో అట్రాక్షన్ లేదు. అది ఏనాడో పోయింది. గ్లామర్ అసలే లేదు! ఇలాటి నిన్ను వెంటేసుకుని విందులకూ, వినోదాలకూ, విదేశాలకూ, రొమాంటిక్ హీరోగా పేరు పొందిన నేను ఎలా వెళ్ళగలను? వెళ్ళినా నాకు లభ్యమయ్యే గౌరవం మాత్రం ఏముంది? అమమ్మలా నువ్వూ, అబ్బాయిలా నేనూ! ఎక్కడికెక్కడ? అందుకే నాతోబాటు వేషాలు ఫిరాయించగల రాధను ఎన్ను కున్నాను. ఆవిడా ఇప్పుడొక పెద్ద తారయింది. తను సంపాదించే డబ్బుకో రక్షణ కావాలి... తనకు కలగబోయే

సంతానానికో తండ్రి కావాలి! అలాటి తరుణంలో ఇద్దరం జతపడ్డాం. మా ఇద్దరిమధ్యా వున్న ఈ వివాహ బంధం చాటున వున్నది కేవలం వ్యాపార రహస్యం! లాభనష్టాల లావాదేవీలు! ఆవిడకో 'భర్త' నాకో గ్లామర్ భార్యా! అంతే!"

పార్వతి విస్మయంగా చూస్తూ నిల్చుండిపోయింది. మళ్ళీ మనోహరే అన్నాడు... "నీకు భుక్తి కేలోటూ రానీయను. రామకృష్ణను నీ యిష్టమొచ్చినంత వరకూ చదివించుకో... వాడి కిష్టమయిన మార్గంలో వాణ్ణి వదిలెయ్! ఎంత ఖర్చయినా నేను భరిస్తాను... ఇక నీకేం దిగులు?"

అవును! పురుషుని దృష్టిలో ఆడదాని విలువ అంతే! స్త్రీని డబ్బులో ముంచెత్తి ఆమెను అష్టదిగ్బంధన చెయ్యొచ్చు ననుకుంటాడు! కానీ స్త్రీ అన్నిటికీ మించి పురుషుని హృదయాన్ని మాత్రమే కోరుతుందని, అతని అనురాగం ఒక్కటీ లభ్యమయ్యే పక్షంలో ప్రపంచంలోని సర్వసుఖాలనూ, సర్వ వస్తు సముదాయాన్ని తృణప్రాయంగా త్యజించ గలదని చాలామంది పురుషులు గ్రహించలేరు.

చూస్తూండగానే అన్ని పత్రికలలో రాధ మనోహర్‌ల ఆదర్శ దాంపత్యాన్ని గురించి, వారి నోముల పంటయిన బాబును గురించి ఫొటోలతోసహా ప్రచురితమైనాయి!

భర్త కనుసన్నలలో మెలిగే భార్య అంటూ రాధ ఫుల్ సైజు ఫొటో ఓ పత్రికలో వేశారు.

భార్యను పువ్వులలో పెట్టి పూజించే భర్త అంటూ వ్రాసి మనోహర్ ఫొటో ప్రకటించారు.

ఎన్ని పనులున్నా, ఎంత తీరికలేకున్నా, క్షణమైనా ఒకరినొకరు ఎడబాయని ఆదర్శ జంట అంటూ వర్ణించారు!

ఇన్ని పత్రికలు చూస్తూ ఇన్ని పొగడ్తలు వింటూ అగ్నిగుండంలో పడిపోయినప్రాణిలా తపించిపోతోంది పార్వతి.

శాస్త్రయుక్తంగా వివాహమాడి, భర్త ఆదరించినా, చీదరించినా నోరెత్తని తను ఈనాడు ఆ భర్తకు ఇల్లాలినని స్వేచ్ఛగా చెప్పుకునే స్వాతంత్ర్యం కూడా లేదు.

"అమ్మా!" అమ్మా! పరుగెత్తుకుంటూ వచ్చిన రామకృష్ణను దగ్గరకు తీసుకుంటూ "ఏం బాబు?" అంది పార్వతి.

"ఈ పేపర్లో చూడమ్మా! నాన్నగారి ఫొటో వేశారు... ఆవి డెవరమ్మా? ఆ పిల్లాడెవరు" ఆసక్తిగా అడిగాడు రామకృష్ణ!

పేపర్లోకి చూచింది పార్వతి.

'ప్రఖ్యాత సినిమా తారలు, ఆదర్శ దంపతులూ అయిన రాధ, మనోహర్ గార్ల విదేశయాత్ర! తమ వెంట బాబును కూడా తీసికెళ్తారట!'

పెద్దపెద్ద అక్షరాలతో వ్రాసి ప్రక్కనే నవ్వుతూ నిల్చునివున్న రాధ, మనోహర్, వాళ్లబాబుల ఫొటో వేశారు...

"ఎవరమ్మా ఈమె?" తిరిగి ప్రశ్నించాడు రామకృష్ణ.

"ఆవిడ... ఆవిడ..." ఏం చెప్పాలో తోచలేదు పార్వతికి ... ఎలాగో తేరుకుని "ఆవిడ ... మీ నాన్నగారి

స్నేహితురాలు బాబూ! ఆ అబ్బాయి ఆవిడ కొడుకు... అంతా విదేశాలకు వెళ్ళొస్తారట బాబూ!" అంది.

"అమ్మా! మనంకూడా వెళ్దామా?" అమాయకంగా అడిగాడు రామకృష్ణ!

పార్వతికి దుఃఖం పెల్లుబికింది. ఎలాగో ఆపుకుంటూ రామకృష్ణ తలమీద మెల్లిగా చేత్తో నిమిరింది. "మనం వెళ్ళ కూడదు బాబూ!" అంది.

"ఏం ఎందుకని?"

ఏం చెప్పాలో క్షణకాలం తోచలేదు పార్వతికి. నాకు విమానాల్లో ప్రయాణమంటే భయంబాబూ! పైగా "నాకు కులాసాగా లేదుకదూ?" అంది బుజ్జగిస్తూ.

"పోనీ నే వెళ్లొస్తానమ్మా నాన్నగారితోబాటు!" అన్నాడు రామకృష్ణ ఆశగా చూస్తూ. హృదయమంతా కెలికి నట్లయ్యింది పార్వతికి.

"ఒద్దుబాబూ! నాన్నగారికి బోలెడన్ని పనులు! నువ్వు వెంటవెళ్తే ఇబ్బందిపడతారు! నువ్వు బాగాచదువుకో! పెద్ద చదువులు చదివాక అలాగే అన్నిదేశాలకూ వెళ్దూగానీ!"

పన్నెండేళ్ళ రామకృష్ణకు అంతటర్కూ, అంత దూరపు ఊహకూడా రాలేదు... తల్లి సలహా ఏమీ రుచించలేదు. నాన్నగారి స్నేహితురాలూ ఆవిడకొడుకూ వెళ్తున్నారుగా? మరివాళ్ళను పిల్చుకెళ్తే నాన్నగారు ఇబ్బందిపడరా? "నేను వెళ్తానమ్మా! నాన్నగారికి నువ్వుచెప్పమ్మా!" ప్రాధేయపడ్తూ,

జాలిగా అడుగుతున్న కొడుకునెలా ఊరడించాలో అర్థంగాని పార్వతికి కన్నీరు కాల్వలైనాయి. తల్లి కన్నీళ్ళు చూచి బేజారెత్తిపోయాడు రామకృష్ణ.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావ్? పోన్లే నిన్ను వదలిపెట్టి నేను వెళ్ళనులేమ్మా! ఏడవకమ్మా!" తనచేతులతో తల్లికన్నీరు తుడిచి వెళ్ళిపోయాడు రామకృష్ణ.

ఆ పసిహృదయానికున్న జ్ఞానమే నా భర్తకు లేదు కాబోలు! అనుకుంది పార్వతి.

ప్రయాణమై వెళ్తూ, చెప్పడానికి వచ్చిన మనోహర్‌తో, రామకృష్ణ కోరికనుగురించి వెల్లడించింది పార్వతి ఉండబట్టలేక.

"ఇంకా నయం! నువ్వూ వస్తాననలేదు!" అన్నాడు మనోహర్ చిరాకుగా!

"నే వస్తానన్నా ఫలితం వుండదని నాకు తెలుసు...కానీ రామకృష్ణ కూడా మీ కుమారుడే కాబట్టి..."

పార్వతి మాట పూర్తి కాలేదు... "కాబట్టే వాడి బాగోగులన్నీ చూచుకుంటున్నాను... వాడు నా కొడుకే కావచ్చు...కానీ ఈనాడు నువ్వూ, వాడూ ఇద్దరూ ప్లేబాక్‌లో మాత్రమే భార్యా పుత్రులు... మామూలు ప్రపంచానికి నా భార్య రాధ! నా బిడ్డ బాబు!'"

'ఆఁ!'

నిర్ఘాంతపోయి చూస్తున్న పార్వతిని చూస్తూ నవ్వుతూ అన్నాడు మనోహర్! "అవును పార్వతీ! కాలమే మారి

పోతోంది చిత్రంగా! ఇక మామూలు మనుషులు మారటంలో ఆశ్చర్యమేముంది...సినిమాలలో చూడు! తెర వెనుక ఎందరో పాటుపడతారు! తెరమీద మరెవరో పేరు తెచ్చుకుంటారు! అలాగే నువ్వూ, రామకృష్ణా తెర వెనుక వుండాలి..."

గేటుదాటి కారు దూసుకపోయింది...

*　　　*　　　*

"వింటున్నావా సరోజా! ఈ బంగళా, ఈ పూల తోట, ఈ డబ్బు, ఈ అంతస్థు ఇవన్నీ ఎంతచక్కటి తెరలో చూస్తున్నావా? వీటన్నిటివెనుకా నా జీవితం ఎంత మరుగు పడివుందో చూశావా?"

పార్వతి వెక్కి వెక్కి పడుస్తూంది! సరోజకు తల గిర్రున తిరుగుతున్నట్లనిపించింది!

"ఇప్పుడు చెప్పు సరోజా? నేను అదృష్టవంతురాలినా? ఎవరికంటే అదృష్టంనాది? భర్త అనురాగానికి నోచుకోలేదు సరికదా, కనీసం ఆ భర్తకు నేను భార్యనని చెప్పుకునే అదృష్ట మేనా నాకులేదు. నా భర్తకూ నాకూ మధ్య ఎన్నో తెరలు! కానీ అవి అందమైనవి. చూపరులను ఆకర్షిస్తాయేకానీ, వారి దృష్టి కర్థంకానివి! ఈ తెరల వెనుక నా జీవితం ఇలా సాగి పోవాల్సిందే!"

పార్వతిని ఊరడిస్తున్న సరోజ కళ్ళు చెమర్చాయి. గాలికి రెపరెప లాడుతున్న ఆ నీలిరంగు తెరలూ, ఇంద్రభవనంలా వున్న ఆ బంగళా, ఆ వాతావరణమూ, సరోజకూ దుర్భరంగా, నరకసదృశంగా గోచరించాయి.